# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి సంబంధించి అనుమతులకోసం సువిధ పోర్టల్‌ను వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.**

**2.** **వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు వైయస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు.**

**3.** **వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 89 లోక్‌సభ స్థానాలకు రెండో దశకు ఈ రోజు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది.**

**4.** **తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూపు-1 దరఖాస్తుల్లో తప్పులను సవరించుకునేందుకు గడువు ఈ రోజు సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.**

**5.** **ఐపీఎల్‌లో భాగంగా చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించింది.**

6. **"ప్రపంచమే ఒక నాటక రంగం" స్ఫూర్తితో ఈరోజు ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

**===========================**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో నున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు అనుసరించాల్సిన విధి విధానాలు మరియు ముందస్తుగా తీసుకోవాల్సిన అనుమతులను వివరించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతి పొందేందుకై సువిధా పోర్టల్ ను వినియోగించుకోవాలని స్పష్టం చేసారు. ఇందుకోసం 48 గంటలకు ముందుగానే సువిధా యాప్ ద్వారా లేదా నేరుగా సంబందిత రిటర్నింగ్ అధికారికి ధరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ నామినేషన్లు, అఫిడవిట్‌లను దాఖలు చేసేందుకు, ముందస్తు

అనుమతులు మంజూరుకై ఆన్లైన్ దరఖాస్తు చేసుకునేందుకు సువిధా పోర్టల్ ను రూపొందించినట్లు తెలిపారు.

---------------------------

ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో బాలలును భాగస్వామ్యం చేయవద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ రాజకీయ పార్టీలకు సూచించింది. రాష్ట్రంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో 18 సంవత్సరాలలోపు బాలలను ఎటువంటి రాజకీయ ప్రచార కార్యక్రమాలు, ప్రచార మాధ్యమాలు, రాజకీయ పార్టీల యొక్క సామగ్రి సరఫరా,పంపిణీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయద్దని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు , సభ్యులు కోరారు .బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో నిన్న జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం బాలలను ఎన్నికల్లో భాగస్వామ్యం చేస్తే ఆయా రాజకీయ పార్టీలపై కఠిన చర్యలు తీసుకుంటామని మార్గ దర్శకాలును జారీ చేసిందని తెలిపారు. బాలలను వినియోగిస్తున్నట్టు కమిషన్ దృష్టికి వచ్చిందని తెలిపారు.

---------------------------

వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు వైయస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించిన అనంతరం మేమంతా సిద్ధం బస్సు యాత్రను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. తొలి రోజు బస్సు యాత్ర కడప పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జరగనుంది.ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు మొత్తం 21 రోజులపాటు ఈ బస్సు యాత్ర కొనసాగనుంది.

---------------------------

వంద రోజుల కాంగ్రెస్ పరిపాలనకు జరగబోయే లోక్ సభ ఎన్నికలు ప్రాతిపదిక అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నేతలతో నిన్న ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాలను గెలిచేలా ప్రణాళిక రూపొందించామన్నారు. తుక్కుగూడాలో ఏప్రిల్ 6 లేదా 7వ తేదీన జాతీయస్థాయి సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సభకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలు హాజరవుతారని.. ఈ సభ నుంచే జాతీయస్థాయి గ్యారంటీలను ప్రకటించబోతున్నామని తెలిపారు.

---------------------------

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ – టీఎస్‌పీఎస్సీ గ్రూపు-1 దరఖాస్తుల్లో తప్పులను సవరించుకునేందుకు కల్పించిన గడువు ఈ రోజు సాయంత్రం 5 గంటలకు ముగియనుందని కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో తమ వివరాలను సరిచేసుకునేందుకు ఇదే చివరి అవకాశమని అభ్యర్దులు తమ వివరాలను సరిచేసుకోవాలని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 175 ఎమ్మెల్యే, 24 ఎంపీ స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. అనకాపల్లి ఎంపీ స్థానాన్ని ప్రకటించాలిసి ఉండగా తాజాగా అనకాపల్లి లోక్‌సభ స్థానానికి అభ్యర్థిని ప్రకటించింది.ప్రసుత్త ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడిని అనకాపల్లి లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు పేర్కొంది.

---------------------------

దేశంలోని ప్రతీ ఇంజనీరింగ్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటైనప్పుడే విదార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఒక ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో నిన్న అయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... భారతదేశం ప్రపంచానికి దీటుగా ఎంతో అభివృద్ధి సాధించిందని, సమాచార విప్లవం కూడా దేశంలో వచ్చిందని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో భవిష్యత్తులో కూడా ఇతర దేశాలపై ఆధారపడకుండా చదువుతోపాటు అదనంగా నైపుణ్యం సంపాదించి విద్యార్థులు బయటికి రావాలని అన్నారు.

---------------------------

వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 89 లోక్‌సభ స్థానాలకు రెండో దశకు ఈ రోజు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. అలాగే లోక్‌సభ ఎన్నికల్లో మొదటి దశకు నామినేషన్లు దాఖలు చేయడానికి ఈ రోజుతో గడువు ముగియనుంది. తొలి దశలో 17 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

---------------------------

ఇండియన్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఐపీఎల్ లో భాగంగా హైదరబాద్ వేదికగా సన్ రైజర్స్ హైదరాబాద్ ముంబై ఇండియన్స్ జట్ల మధ్య ఈరోజు సాయంత్రం మ్యాచ్ జరగనుంది. కాగా నిన్నరాత్రి చెన్నై వేదిక జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గుజరాత్ టైటాన్స్ పై విజయం సాధించింది. గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 143 పరుగులు చేయగా చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 206 పరుగుల భారీస్కోరు చేసి 63 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించింది.

---------------------------

హైదరాబాద్ వేదికగా ఉప్పల్ క్రీడా మైదానంలో ఈ రోజు సన్ రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య తొలి ఐపీఎల్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు. క్రికెట్ అభిమానుల కోసం నగరంలోని పలు ప్రాంతాల నుంచి స్టేడియానికి 60 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ఈ రోజు సాయంత్రం 6గంటలకు ఈ బస్సులు ప్రారంభమై.. తిరిగి రాత్రి 11గంటల 30 నిముషాలకు స్టేడియం నుంచి బయ లుదేరుతాయని తెలిపారు.

---------------------------

"ప్రపంచమే ఒక నాటక రంగం" స్ఫూర్తితో ఈ రోజు ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా శాంతి స్థాపనకు రంగస్థలం దోహదం చేయాలనే సందేశాన్ని అందిస్తూ 1962 నుండి అంతర్జాతీయ నాటకరంగ సంస్థ–ఐటిఐ ప్రతి ఏటా మార్చి 27వ తేదీన ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ప్రజలను సామాజిక అంశాల పట్ల చైతన్య పరచడమే కాకుండా ఆయా దేశాల సాంస్కృతిక వారసత్వ చారిత్రక అంశాలను నేటి తరాలకు చేరవేసే వారధులుగా కూడా రంగస్థలం వేదికగా ప్రదర్శింపబడే అనేక ప్రక్రియలు దోహదం చేస్తాయని చాటిచెబుతూ... ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మనదేశంలో నాటికోత్సవాలు, నాటికల పోటీలు, పలు రకాల కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

---------------------------

విశాఖపట్నంలో భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ డేగా విమానాశ్రయంలో రన్‌వే రీసర్ఫేసింగ్ పనులు పూర్తయినట్లు నౌకా దళ అధికార వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది 2023 నవంబర్ 15 న రీసర్ఫేసింగ్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో రాత్రివేళల్లో విమానాల రాకపోకలు రద్దు చేశారు..షెడ్యూల్ ప్రకారం మార్చి 31 వరకూ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు గడువు వున్నప్పటికీ ఐదు రోజుల ముందే విజయవంతంగా పనులు పూర్తి చేశామని అధికారులు తెలిపారు.

---------------------------

వాల్తేర్ రైల్వే డివిజన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సర చరమాంకంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 10 వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించింది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఐదు రోజుల ముందుగానే ఈ ఘనత సాధించినట్టు డి. ఆర్ఎమ్ సౌరభ్ ప్రసాద్ పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2022–23తో పోలిస్తే 10 శాతం కంటే ఎక్కువ వృద్ధి సాధించామని తెలిపారు. ఈ విజయానికి ప్రయాణీకుల కోసం చేపట్టిన మెరుగైన పద్ధతులు, వారితో సన్నిహిత సమన్వయం, కార్యాచరణ సామర్థ్యం ఎంతో దోహదం చేశాయని అన్నారు..మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులు , భద్రతకు సంబంధించిన ఆధునీకరణ ప్రయత్నాలు వంటి వివిధ సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, వాల్తేర్ డివిజన్‌లోని అన్ని విభాగాలు సమిష్టికృషితో ఈ ఘనత సాధించినట్లు సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

సమున్నత లక్ష్యాలతో ప్రతి విద్యార్థి ఉన్నతస్థానాలకు ఎదగాలని కాకినాడ జేఎన్టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.సుమలత సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం లోని ఏపీ నిట్‌లో సంస్థలోని నేచర్ వేల్యూ ఎడ్యుకేషన్ క్లబ్ సహకారంతో సాంకేతికత, మహిళా సాధికారత అనే అంశంపై విద్యార్థినులకు నిన్న నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ, వ్యాపార, శాస్త్ర, సాంకేతికరంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తూ దేశ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రతి విద్యార్థిని స్వశక్తితో, స్వేచ్ఛగా ఆలోచనలు చేస్తూ ఎంచుకున్న రంగానికి వన్నె తీసుకురావాలని తెలిపారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సుమలత వివరించారు.

=====================